క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖలకు చెందిన అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

రైతులకు అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రైతు వేదికలో మంగళవారం పత్తి, వరి పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట చేలలో నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. సాగులో సందేహాలు ఉంటే రైతునేస్తం కార్యక్రమంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీవిద్య, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరిస్తాం'



మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీలు, సమగ్రశిక్షలోని వివిధ వింగుల్లో పనిచేస్తున్న సిబ్బందికి పీఆర్‌టీయూ ఎప్పుడు అండగా ఉంటుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల మోడి, కేజీబీవీల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట పీఆర్టీయూ మండలాధ్యక్షుడు భరత్‌రావు ఉన్నారు.

'సీనియర్ సిటిజన్‌లకు అందని వైద్యసేవలు'

కాగజ్‌నగర్‌రూరల్: సీనియర్ సిటిజన్‌లకు వైద్య సేవలు అందడం లేదని సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్‌లకు ఆలనా సంచార వాహనాల ద్వారా ఆరోగ్య సేవలు ఇంటివద్దనే అందించాల్సి ఉన్నా వైద్య, ఆరోగ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎఎస్ఆర్ మూర్తి, కలికోట రమణయ్య, ఆకుల నాగేశ్వర్‌రావు, రామయ్య, సుదర్శన్, ఉపేందర్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

'భారత్ బంద్' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: ఎస్సీ, ఎస్టీ సంఘాల పిలుపు మేరకు బుధవారం ప్రకటించిన భారత్‌బంద్‌లో ఎస్సీ, ఎస్టీలు పాల్గొని విజయవంతం చేయాలని మహర్ సంఘం సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని బుద్ధవిహార్‌లో మంగళవారం మహార్ సంఘాల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగబద్ధంగా లేదన్నారు. ఆగయ్య, ఆత్మరాం, వసంత్, బండురావు, వెంకటేశ్, దిలీప్, అశోక్, కిశోర్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు సామరస్యంగా నిర్వహించాలి

కాగజ్‌నగర్‌రూరల్: గణేశ్ ఉత్సవాలను సామరస్యంగా నిర్వహించుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరాత్రుల సమయంలో కమిటీ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించారు. పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డబ్బులు చోరీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం సాయంత్రం చోరీ జరిగింది. బాధితుడు పట్టణానికి చెందిన మంథెన రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి వెళ్లేందుకు సాయంత్రం 5 గంటలకు రవీందర్ ఆసిఫాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కాడు. కొంతదూరం వెళ్లాక కండక్టర్ టికెట్ కోసం డబ్బులు అడగ్గా జేబులు చూసుకొని తన వద్ద ఉన్న రూ.1,200 చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీంతో చేసేదేం లేక టికెట్‌కు డబ్బులు కూడా లేకపోవడంతో మధ్యలోనే బస్సు దిగాల్సి వచ్చిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రాఖీ పండుగ సందర్భంగా బస్టాండ్‌లో రద్దీ ఉన్న క్రమంలో డబ్బులు దొంగిలించారని వాపోయాడు. ఇప్పటికైనా రద్దీ ఉన్న సమయాల్లో పోలీసు నిఘా పెంచాలని ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశాడు.





మంప్స్ బెల్స్..!

- జిల్లాలో గవదబిళ్లల విజృంభణ
- పిల్లలు, పెద్దలకూ వైరస్ వ్యాప్తి
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

కౌటాల: జిల్లాలో ఇప్పటికే విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, తాజాగా మంప్స్ (గవద బిళ్లలు) వ్యాప్తి చెందుతూ జిల్లావాసులను కలవరపెడుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా పిల్లల్లో మంప్స్ (గవద బిళ్లలు) ఉండి జ్వరం, పెద్దల్లో జ్వరంతో పాటు తీవ్ర దగ్గు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వైరస్ వ్యాపించడంతో బాధితులు రోజువారీ పనులు సైతం వదులుకొని ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చిన్నారులు ఎక్కువగా గవద బిళ్లలతో అవస్థలు పడుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఇన్‌ఫెక్షన్‌లతో..

గవదబిళ్లలు అంటే చెవి కింది గ్రంథులు వాచి నొప్పి పెడతాయి. సరిగా అన్నం తినలేరు. ఏమి తాగలేరు. జ్వరం కూడా ఉంటుంది. వీటిని పెరోటైటిస్(మంప్స్)గా వైద్యులు పేర్కొంటారు. ఇది రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో, పోషకాహార లోపాలు ఉన్న వారిలో కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల సోకుతుంది. పెరోటైటిస్ గ్లాండ్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకడం వల్ల సమస్య ఏర్పడుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. స్ట్రెప్టోకోకల్, స్టఫైలోకోకల్, ఈ-కోలై, ఇతర బ్యాక్టీరియాతో పాటు ఇన్‌ఫ్లూయెంజా, కొక్సాకీ వైరస్, సైటోమెగాలో వంటి వైరస్‌లతో కూడా ఇన్‌ఫెక్షన్‌కు గురై దీని బారిన పడుతారని వైద్యులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో డెంటల్ (దంతాల) ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు ఉన్నాయి. చిన్న పిల్లలు గవద బిళ్లల సమస్య ఎదురైనప్పుడు వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతుంటారు. సమస్య చెప్పుకోలేక ఏడుస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాప్తి ఇలా..

పిల్లల్లో గవద బిళ్లలు రావడం సాధారణమే. ఐదేళ్ల నుంచి పదిహేనేళ్ల వయస్సు మధ్య ఉన్న పిల్లలు ఈ వ్యాధి బారిన పడుతుంటారు. కొన్నిసార్లు పెద్దల్లో కూడా గవద బిళ్లలు కనిపిస్తుంటాయి. గవద బిళ్లలు వైరస్‌లతో సంక్రమించే వ్యాధి. చలికాలంలో ఎక్కువగా వస్తుంది. కానీ ఈసారి వర్షకాలంలో సైతం గవద బిళ్లలు వ్యాధి సోకుతోంది. గవద బిళ్లల సమస్యతో బాధపడుతున్న వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, మాట్లాడినప్పుడు వైరస్ గాలిలో ప్రయాణించి ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. స్కూళ్లకు వెళ్లే చిన్న పిల్లల్లో ఒకరికి సమస్య ఎదురైతే తెలియకుండానే ఒకరి ద్వారా మిగితా వారికి వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. వ్యాధి పూర్తిస్థాయిలో సోకడానికి 10 నుంచి 15 రోజుల సమయం పడుతుంది. చికిత్స అనంతరం వారం రోజుల్లో తగ్గిపోతుంది.

ఆస్పత్రులకు క్యూ..

గవద బిళ్లల సమస్యతో చిన్నపిల్లల ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాలతో పాటు కౌటాల మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో గవద బిళ్లలు సమస్యతో వస్తున్న వారే అధికంగా ఉన్నారు. ఇటీవల కాలంలో వందలాది మందికి వైరస్ సోకింది. కొన్ని కుటుంబాల్లో పిల్లల ద్వారా పెద్దవాళ్లకు సైతం వైరస్ వ్యాప్తి చెందింది. గవద బిళ్లల లక్షణాలు కనిపించగానే ముఖ్యంగా పిల్లలను పాఠశాలకు పంపించకుండా ఇంట్లోనే ఐసోలేషన్ చేయాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో గవద బిళ్లలు వచ్చిన పిల్లలను పాఠశాలలకు పంపిస్తుండడంతో కొంతమంది ఉపాధ్యాయులకు సైతం వ్యాధి సోకుతోంది.

భయపడొద్దు.. తేలికగా తీసుకోవద్దు



గవద బిళ్లలుగా పిలిచే మంప్స్ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. జ్వరం, తలనొప్పి, నీరసించిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇంట్లో ఒక చిన్నారిలో సమస్య గమనిస్తే మిగతావారికి కూడా వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. వ్యాధికి భయపడొద్దు.. అలాగని తేలికగా తీసుకోవద్దు. వైరస్ బారిన పడినప్పుడు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. మందులు వాడడంతో పాటు శక్తినిచ్చే ద్రవ ఆహారాన్ని అందిస్తే త్వరగానే వ్యాధి తగ్గిపోతుంది.

– డాక్టర్ నవత, డీడీవో, లోనవెల్లి

అర్హత గల రైతులందరికీ రుణమాఫీ చేయాలి



పెంచికల్‌పేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాగజ్‌నగర్‌రూరల్: ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెంచికల్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, రూ.లక్ష లోపు రుణాలు సైతం మాఫీ కాలేదని ఆరోపించారు. అర్హులైన ప్రతి రైతు రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, రైతులు ఉన్నారు.

'రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం'

కాగజ్‌నగర్‌రూరల్: అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు లెండుగురె శ్యాంరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తలు రాస్తారోకో చేపట్టి అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఓదెలు, మొయిన్, రాజ్‌కుమార్, రాజు, కన్నయ్య, శ్రీనివాస్, అస్లాం, లలిత, అనిత, చంద్రకళ, స్వప్న, రావూజీ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

తిర్యాణి: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మోకుదెబ్బ సంఘం నాయకులు అన్నారు. సర్వాయి పాపన్న 374వ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన వ్యతిరేఖంగా పోరాటం చేసి గోల్కొండ కోటపై బహుజన జెండా ఎగురవేసిన గొప్ప పోరాట యోధుడు అని కొనియాడారు. మోకుదెబ్బ సంఘం రాష్ట్ర నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్, మార్క శంకర్‌గౌడ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మగాని శంకర్ గౌడ్, నాయకులు జుంగోని అశోక్ గౌడ్, వెంకటేశం గౌడ్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నిషా జోహ్రీ, జగేంద్ర కుమార్ జోగ్రీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వలంటీర్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో పేద విద్యార్థులకు సేవలు అందిస్తున్న ట్రస్టు తెలంగాణలో మొట్టమొదటి సారిగా మారుమూల గ్రామంలోని పేద విద్యార్థులకు బ్యాగులు పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. రానున్న రోజుల్లో ట్రస్టు సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ్, హెచ్ఎం అశోక్, ఉపాధ్యాయులు ప్రశాంత్, తిరుమల్, వాలంటీర్ రేణుక విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న వలంటీర్లు

వాటర్ బాటిళ్ల పంపిణీ..

మండలంలోని చేడ్వాయి ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులకు మండల విద్యాధికారి రమేశ్ బాబు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాకేశ్, రాజ్‌కమలాకర్ రెడ్డి, సీఆర్‌పీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కెరమెరి: ఈనెల 9న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనకు నిరసనగా మంగళవారం రాత్రి యువజన సంఘాల ఆధ్వర్యంలో మండలంలో అంబేద్కర్ విగ్రహం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో మానవహారం నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు కోవ విజయ్, యూత్ నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

మహిళలకు రక్షణగా షీటీం

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు అండగా షీటీం పని చేస్తుందని షీటీం సభ్యురాలు సేనిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ స్కూల్ విద్యార్థులకు షీటీం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ షీటీం మహిళలకు రక్షణనిస్తుందని, మహిళలు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు గురైతే వెంటనే 1098 నంబర్‌కు కాల్ చేసి షీటీంకు సమాచారం అందించాలని సూచించారు.

ముగిసిన ఎక్కాహం



భజన చేస్తున్న భక్తులు

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక పోచమ్మ ఆలయంలో నిర్వహించిన ఎక్కాహం ముగిసింది. సోమవారం నుంచి ప్రారంభమైన ఎక్కాహం మంగళవారం సాయంత్రం వరకు కొనసాగింది. భక్తులు ఆలయం వద్ద భజన చేశారు. పాడి పంటలు పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

'వికాసం పుస్తకాలతో పఠనాసక్తి'



పుస్తకాలు చదివిస్తున్న ఉపాధ్యాయులు

రెబ్బెన: బొమ్మలు, కథలతో కూడిన వికాసం పుస్తకాలతో పిల్లల్లో పఠనాసక్తి పెరుగుతోందని తుంగెడ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య అన్నారు. మంగళవారం పాఠశాలలో రీడింగ్ కాంపెన్ ప్రోగ్రాం నిర్వహించారు. పిల్లల చేత పుస్తకాన్ని చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించేందుకు కథల, పుస్తకాలను, కార్డ్స్, పోస్టర్లు, వికాసం 1, వికాసం 2 పుస్తకాలను వినియోగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగయ్య, వనితలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో శ్రీగాయత్రీ యజ్ఞం

కాగజ్‌నగర్‌రూరల్: పతాంజలి యోగా శిబిరం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బాల భారతి పాఠశాలలో శ్రీగాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించారు. యోగా గురువు అశోక్ ఆర్యా ఆధ్వర్యంలో నిర్వహించిన యజ్ఞంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



గాయత్రీ యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



వాంకిడి: నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న రావి శ్రీనివాస్

వాంకిడి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు అనిల్, గణేశ్, దాదాజీ, పెంటు, సాయి, కినక సోము, అరుణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రాజీవ్ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తిరుపతి, నాయకులు సులేమాన్, హాజీ, సంతోష్ పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో వైద్యశిబిరాలు



కెరమెరి: రక్తనమూనాలు సేకరిస్తున్న సిబ్బంది



వాంకిడి: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని నిషాని, సుర్దాపూర్ గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 27 మందికి రక్తపూతలు సేకరించారు. వానాకాలంలో వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఎం తిరుమల, వందన, హెచ్‌ఏలు వసంత్, శంకర్ తదితరులు ఉన్నారు.

వెల్గీ ఆశ్రమ పాఠశాలలో..

వాంకిడి: మండలంలోని వెల్గీ ఆశ్రమ పాఠశాలలో మండల వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మందులు పంపిణీ చేశారు. ఏసీఎంవో ఉద్ధవ్, ఆర్బీఎస్కే ఎమ్‌వో సుమంగళి, హెచ్‌ఈవో రవిదాస్ పాల్గొన్నారు.

రోడ్ల పరిస్థితులపై ఆరా

దహెగాం: మండలంలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఈనెల 17న మండలానికి చెందిన యువత జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించగా, కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో రోడ్ల పరిస్థితిపై డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ మంగళవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రోడ్లను పరిశీలించారు. అనంతరం పలువురు యువకులతో మాట్లాడారు. రోడ్ల పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ బాబు, యువకులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బెజ్జూర్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై విక్రమ్ అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసు కళాబృందం ద్వారా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీటీమ్, గంజాయి నివారణ, సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి కళాకారులు కళ్లకు కట్టేలా వివరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ మోసగాళ్లు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పోలీసు కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంఘవి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై విక్రమ్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నార్నూర్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఎంపీడీవో జవహర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మండల కేంద్రంతోపాటు తాడిహత్నూర్ గ్రామంలో మంగళవారం రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ రోగుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారినపడుతారన్నారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎంపీవో స్వప్నశీల, స్వప్న, శీలా, ఆశకార్యకర్త జ్యోతి, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తులు స్వీకరణ

లింగాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రుణమాఫీ కాని రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే రుణమాఫీ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న మాలి సంఘం నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కౌటాల సీఐ ముత్యం రమేశ్‌ను మాలి సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. కౌటాల సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐను వారు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, నాయకులు బాపురావు, శంకర్, చందు, ముక్తేశ్వర్, పాండురంగ్, గణేశ్ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారికి సన్మానం



ఏవో మిలింద్ కుమార్‌ను సన్మానిస్తున్న రైతులు

వాంకిడి: మండల వ్యవసాయ అధికారిగా సేవలు అందించి బదిలీపై వెళ్తున్న జాడి మిలింద్ కుమార్‌ను గ్రామ రైతులు మంగళవారం ఘనంగా సన్మానించారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ వ్యవసాయంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హివ్రె ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.